# జూన్ 10న మహా ధర్నా

**ఇంధన, నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలి**

**మహా ధర్నాను విజయవంతం చేయాలి**

**సిపిఐ పట్టణ కార్యదర్శి కంచర్ల జమలయ్య పిలుపు**



**భద్రాద్రి జిల్లా బ్యూరో, జూన్ 06 (వార్త సంధ్య) :** పెట్రోల్, డీజిల్, గ్యాస్‌తో పాటు నిత్యావసర వస్తువుల ధరలు రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో వాటికి వ్యతిరేకంగా జూన్ 10న జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట నిర్వహించనున్న మహా ధర్నాను విజయవంతం చేయాలని సిపిఐ కొత్తగూడెం పట్టణ కార్యదర్శి కంచర్ల జమలయ్య పిలుపునిచ్చారు. ప్రశాంతి నగర్ గ్రామపంచాయతీలో నిర్వహించిన సిపిఐ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పెరుగుతున్న ధరల భారంతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ప్రజా సమస్యలపై నిరంతరం స్పందిస్తూ వాటి పరిష్కారం కోసం ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని సూచించారు. పార్టీ బలోపేతానికి కృషి చేయడంతో పాటు ప్రజాపక్షాన పోరాటాలు నిర్వహిస్తున్న భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) చేపడుతున్న ఉద్యమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. అనంతరం జూన్ 10 ధర్నాకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రశాంతి నగర్ గ్రామపంచాయతీ సర్పంచ్ వాడే రాములు, వార్డు సభ్యులు, సిపిఐ నాయకులు మర్రి గోపి, మండల రాజేశ్వరరావు, విరిగినేని రాజేందర్, మట్టి కొండయ్య, సమ్మక్క, జయంత్, ధారా లక్ష్మి, రోజా, కమల తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాల వసతుల మెరుగుదలకు ఎమ్మెల్యే కోరం కు వినతిపత్రం

**అవసరమైన నిధులు కేటాయిస్తానని ఎమ్మెల్యే హామీ**



**భద్రాద్రి జిల్లా బ్యూరో, జూన్ 06 (వార్త సంధ్య) :** ముత్తారపుకట్ట ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతుల అభివృద్ధి కోసం అవసరమైన నిధులు కేటాయించాలని కోరుతూ ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్యకు పాఠశాల ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. పాఠశాలలో తరగతి గదుల స్లాబ్‌లు, ఫ్లోరింగ్, కిటికీల మరమ్మతులు, వంటగది, మూత్రశాలలు, మరుగుదొడ్ల రిపేర్లతో పాటు నూతన మరుగుదొడ్లు, మూత్రశాలల నిర్మాణానికి ఎమ్మెల్యే నిధులు మంజూరు చేయాలని వినతిపత్రంలో కోరారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు కబ్బాకుల రవి, పీఏసీఎస్ ఇల్లందు డైరెక్టర్ కిన్నెర నరసన్న ఎమ్మెల్యేను కలిసి పాఠశాలలో నెలకొన్న సమస్యలను వివరించారు. విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించేందుకు మౌలిక వసతుల అభివృద్ధి అత్యవసరమని తెలిపారు. వినతిపత్రాన్ని స్వీకరించిన ఎమ్మెల్యే కోరం కనకయ్య పాఠశాల సమస్యలను సానుకూలంగా పరిశీలించి, వసతుల మెరుగుదలకు అవసరమైన సహకారం అందించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా పాఠశాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రతినిధులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కల నాటకం

**ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 12 ఏళ్ల సుపరిపాలనకు గుర్తుగా ప్రత్యేక కార్యక్రమం**

**ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి**



**భద్రాద్రి జిల్లా బ్యూరో, జూన్ 06 (వార్త సంధ్య) :** ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని, అలాగే దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో 12 సంవత్సరాలుగా కొనసాగుతున్న సుపరిపాలనకు గుర్తుగా గౌతంపూర్ గ్రామంలో బీజేపీ ఆధ్వర్యంలో మొక్కల నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. బీజేపీ సీనియర్ నాయకులు సొప్పరి క్రాంతి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు పొన్నగంటి రాజు హాజరై మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తమ వంతు బాధ్యత నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. మొక్కల పెంపకం వల్ల పర్యావరణ సమతుల్యత నెలకొనడంతో పాటు వర్షాలు సకాలంలో కురిసే అవకాశాలు పెరుగుతాయని అన్నారు. వ్యవసాయాధారిత దేశమైన భారతదేశంలో రైతులు అభివృద్ధి చెందితేనే దేశం పురోగతి సాధిస్తుందని పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు ప్రతి కుటుంబం కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షించాలని సూచించారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించేందుకు పర్యావరణ పరిరక్షణ అత్యంత అవసరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా మండల అధ్యక్షురాలు స్వప్న, మండల ప్రధాన కార్యదర్శి రతన్ లాల్, గౌతంపూర్ వార్డు సభ్యులు గుత్తుల తరుణ్, ప్రియాంక, యువ మోర్చా నాయకులు మహేష్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.


## భద్రాచలంలో పోలీసుల కార్డాన్ అండ్ సెర్చ్ ఆపరేషన్

**37 ద్విచక్ర వాహనాలు, 2 ఆటోలు స్వాధీనం**

**మాదకద్రవ్యాలు, సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన**



**భద్రాద్రి జిల్లా బ్యూరో, జూన్ 06 (వార్త సంధ్య) :** జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు భద్రాచలం డీఎస్పీ అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో శనివారం తెల్లవారుజామున భద్రాచలం టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అయ్యప్ప కాలనీ, రెవెన్యూ కాలనీల్లో కార్డాన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ తనిఖీల్లో సరైన పత్రాలు, నంబర్ ప్లేట్లు లేని 37 ద్విచక్ర వాహనాలు, 2 ఆటోలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం కాలనీవాసులతో సమావేశం నిర్వహించిన డీఎస్పీ అరుణ్ కుమార్,



మాదకద్రవ్యాల అక్రమ రవాణా, వినియోగంపై హెచ్చరికలు జారీ చేశారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్లు ధరించాలని, కాలనీల్లో నేరాల నియంత్రణ కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు సంబంధించిన సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. మహిళలు, పిల్లల భద్రతపై కూడా పలు సూచనలు చేశారు. సుమారు 90 మందికి పైగా పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్న ఈ ఆపరేషన్‌లో డీఎస్పీ అరుణ్ కుమార్, ఇన్‌స్పెక్టర్ నాగరాజు, సబ్ ఇన్‌స్పెక్టర్లు, సీఆర్పీఎఫ్ సిబ్బంది, ట్రాఫిక్ పోలీసులు, స్పెషల్ పార్టీ సిబ్బంది, నార్కోటిక్స్ స్నిఫర్ డాగ్ బృందం పాల్గొన్నారు.

# గ్రామాభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

**గ్రామసభల ద్వారా ప్రజా సమస్యలకు పరిష్కారం**

**గ్రామ సభల్లో ఎమ్మెల్యే జారె**

**చంద్రుగొండ ప్రతినిధి, జూన్ 06 (వార్త సంధ్య) :** అశ్వారావుపేట నియోజకవర్గ పరిధిలోని దమ్మపేట మండలం లింగాలపల్లి జమేదారుబంజర దమ్మపేట గ్రామపంచాయతీ కార్యాలయాలలో తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తున్న గ్రామసభల్లో జారె ఆదినారాయణ పాల్గొన్నారు. గ్రామాల సమగ్ర అభివృద్ధి ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా విడతల వారీగా నిర్వహిస్తున్న ఈ గ్రామసభలు ప్రజాపాలనకు అద్దం పడుతున్నాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు

ఈ సందర్భంగా ప్రభుత్వం నిర్దేశించిన ఏడు ముఖ్య అంశాలపై గ్రామస్థులతో ప్రత్యక్షంగా చర్చించి వారి సమస్యలు సూచనలు అవసరాలను తెలుసుకున్నారు త్రాగునీటి సరఫర వర్షాకాల సన్నద్ధత ఘనవ్యర్థాల నిర్వహణ జలసంరక్షణ మొక్కల పెంపకం వనసంరక్షణ ఓటర్లజాబితా ప్రత్యేక సమగ్ర సవరణ వరదలు మరియు విపత్తుల నిర్వహణ వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు గ్రామాల్లో తలెత్తుతున్న సమస్యలను వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కార చర్యలు



చేపట్టాలని ఆదేశించిన ఎమ్మెల్యే పరిష్కారం కావలసిన ప్రధాన సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి నిధులు పరిపాలనా అనుమతులు సాధించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు

ప్రజల భాగస్వామ్యంతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని ప్రతి గ్రామసభను ప్రజలు సద్వినియోగం చేసుకుని తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని ఆయన పిలుపునిచ్చారు గ్రామసభలు కేవలం సమావేశాలు కాకుండా గ్రామాల భవిష్యత్ అభివృద్ధికి మార్గదర్శక వేదికలుగా



నిలవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రవీందర్ రెడ్డి స్థానిక సర్పంచ్ పగడాల రమాదేవి, ఈశ్వరప్రగడ నాగభూషణం ఉప సర్పంచ్ ఆంగోత్ శ్రీనివాసరావు టౌన్ అధ్యక్షులు చిన్నశెట్టి చిట్టిబాబు ఎలక్ట్రికల్ ఏఈ రవికిరణ్ ఇరిగేషన్ ఏఈ కృష్ణ ఆర్డబ్ల్యూఎస్ ఏఈ సురేంద్ర అగ్రికల్చర్ ఏఓ చంద్రశేఖర్ పంచాయతీరాజ్ ఏఈ జుంకీలాల్, వార్డుసభ్యులు ప్రజాప్రతినిధులు వివిధ శాఖల అధికారులు గ్రామపెద్దలు మహిళలు యువత గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాపాలన గ్రామసభలో సమస్యల వెల్లువ

**ఇందిరమ్మ ఇళ్లు, పెన్షన్లు, రోడ్లు, డ్రైనేజీలపై వినతిపత్రం**

**సీజనల్ వ్యాధుల నివారణకు పారిశుధ్యం పై ప్రత్యేక దృష్టి**

**24వ డివిజన్ అభివృద్ధికి చర్యలు తీసుకుంటాం మేయర్ హామీ**

**చంద్రుగొండ ప్రతినిధి, జూన్ 06 (వార్త సంధ్య) :** ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజాపాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ 24వ డివిజన్‌లో శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కొత్తగూడెం మున్సిపల్ కమిషనర్ కె. సుజాత, మేయర్ మూతి గణేష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా 24వ డివిజన్ కార్పొరేటర్ పొలుమూరి ధనలక్ష్మి డివిజన్ ప్రజల సమస్యలను వివరించే వినతిపత్రాన్ని కమిషనర్, మేయర్‌లకు అందజేశారు. సొంత స్థలం ఉన్నవారికి, లేనివారికి అర్హత ఆధారంగా ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్ల అందజేత, రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం, శాశ్వత అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు, డంపింగ్ యార్డ్, స్మశానవాటిక సమస్యల పరిష్కారంతో పాటు పలు అభివృద్ధి



కార్యక్రమాలకు సహకరించాలని కోరారు. మేయర్ మూతి గణేష్ మాట్లాడుతూ డివిజన్‌లో ఉన్న సమస్యలను సానుకూలంగా పరిశీలించి, త్వరలోనే అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇస్తామని హామీ ఇచ్చారు. 24వ డివిజన్‌ను అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ కె. సుజాత మాట్లాడుతూ వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పారిశుధ్య నిర్వహణపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని, ప్రతి ఇంటిలో ఇంకుడు గుంటల ఏర్పాటుకు ప్రజలు సహకరించాలని కోరారు. ఈ



సందర్భంగా ఏఐటీయూసీ కార్పొరేట్ నాయకుడు క్రిస్టోఫర్ సింగరేణి ఇళ్ల మధ్యలో సొంత ఇళ్లు కలిగిన కుటుంబాలు ఎదుర్కొంటున్న సమస్యలను మేయర్ దృష్టికి తీసుకెళ్లగా, సమస్యను పరిశీలించి తగిన నిర్ణయం తీసుకుంటామని మేయర్ హామీ ఇచ్చారు. గ్రామసభ విజయవంతానికి సహకరించిన బర్మా క్యాంపు, సుబ్బయ్య నగర్, చమన్ బస్తీ ప్రజలకు కార్పొరేటర్ ధనలక్ష్మి కృతజ్ఞతలు తెలిపారు. అర్హులైన పేదలందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా కృషి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు క్రిస్టోఫర్, గట్టయ్య, భానుప్రసాద్, ఉదయ్, రవికిరణ్, వరుణ్ దారా, చక్రధర్, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# గెలిచారు... కానీ అభివృద్ధి ఎక్కడ?



**నాలుగు నెలలు గడిచినా డివిజన్లలో పనుల జాడ లేదు!**


**హామీల మోత... నిధుల కొరతతో కార్పొరేటర్ల తిప్పలు**

**రహదారులు, డ్రైనేజీలు, తాగునీటి సమస్యలు యథాతథం**

**వెంటనే నిధులు కేటాయించాలని కార్పొరేటర్ల డిమాండ్**

**ప్రజల ప్రశ్నలకు సమాధానం లేని పరిస్థితి**

**కొత్తగూడెం కార్పొరేషన్‌లో అభివృద్ధికి బ్రేక్ పడిందా?**




**భద్రాద్రి జిల్లా బ్యూరో, జూన్ 06 (వార్త సంధ్య) :** కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలు ముగిసి నూతన కార్పొరేటర్లు బాధ్యతలు చేపట్టి నాలుగు నెలలు పూర్తవుతున్నా, ఇప్పటివరకు డివిజన్లలో ఆశించిన స్థాయిలో అభివృద్ధి పనులు ప్రారంభం కాకపోవడం చర్చనీయాంశంగా మారింది. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలు, అభివృద్ధి వాగ్దానాలు ఇప్పటికీ కార్యరూపం దాల్చకపోవడంతో ప్రజల్లో అసంతృప్తి క్రమంగా పెరుగుతోందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఎన్నికల ప్రచార సమయంలో ప్రతి డివిజన్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని, రహదారులు, డ్రైనేజీలు, తాగునీటి సమస్యలు, వీధి దీపాలు, పారిశుద్ధ్య వ్యవస్థ, కమ్యూనిటీ హాళ్లు, పార్కుల అభివృద్ధి వంటి అనేక అంశాలపై కార్పొరేటర్లు ప్రజలకు హామీలు ఇచ్చారు. అయితే గెలిచిన తరువాత నాలుగు నెలలు గడిచినా అనేక డివిజన్లలో ఒక్క కొత్త అభివృద్ధి పని కూడా ప్రారంభం కాలేదని ప్రజలు విమర్శిస్తున్నారు. ప్రస్తుతం డివిజన్లలో ప్రధానంగా తాగునీటి సమస్యలు, దెబ్బతిన్న రహదారులు, పూడికతో నిండిపోయిన డ్రైనేజీలు, పారిశుద్ధ్య సమస్యలు కొనసాగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు.

ఎన్నికల సమయంలో ప్రజల ఇంటింటికీ వెళ్లి సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన ప్రజాప్రతినిధులు ఇప్పుడు నిధుల కొరతను కారణంగా చూపుతున్నారని అంటున్నారు. ఇక నూతన కార్పొరేటర్ల పరిస్థితి కూడా అంతంత మాత్రంగానే ఉందని రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. ప్రజల సమస్యలు తమ దృష్టికి వచ్చినప్పటికీ, అభివృద్ధి పనులు చేపట్టేందుకు అవసరమైన నిధులు అందుబాటులో లేకపోవడంతో వారు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలుస్తోంది. డివిజన్ల అభివృద్ధికి ప్రత్యేక నిధులు విడుదల కాకపోవడంతో అనేక ప్రతిపాదనలు ఫైళ్లకే పరిమితమయ్యాయని సమాచారం. కార్పొరేషన్ ఎన్నికల సమయంలో అధికార పార్టీ నాయకులు అభివృద్ధి పనులకు ఎలాంటి నిధుల కొరత ఉండదని, ప్రజల అవసరాలకు అనుగుణంగా అన్ని డివిజన్లను అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. కానీ ప్రస్తుతం పరిస్థితి చూస్తే ఆ హామీలు అమలుకు ఇంకా సమయం పట్టేలా కనిపిస్తోందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. కొన్ని డివిజన్లలో కార్పొరేటర్లు ప్రజల నుంచి వ్యతిరేకతను ఎదుర్కొంటున్నట్లు సమాచారం. "గెలిపించి నాలుగు నెలలు అవుతోంది... మా కాలనీలో ఒక్క పని కూడా జరగలేదు", "ఎన్నికల ముందు కనిపించిన నాయకులు ఇప్పుడు కనిపించడం లేదు", "సమస్యలు చెప్పినా నిధులు లేవనే సమాధానం వస్తోంది" అంటూ పలువురు ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇదే పరిస్థితి కొనసాగితే రాబోయే రోజుల్లో ప్రజల ఆగ్రహం మరింత పెరిగే అవకాశం ఉందని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. ప్రజలు కూడా కనీసం చిన్నచిన్న అభివృద్ధి పనులైనా ప్రారంభించి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుకు శ్రీకారం చుట్టాలని కోరుతున్నారు. ప్రస్తుతం కొత్తగూడెం కార్పొరేషన్‌లో అభివృద్ధి పనుల కంటే నిధుల కొరత, హామీల అమలు, ప్రజల అసంతృప్తి అంశాలే ఎక్కువగా చర్చకు వస్తుండటం గమనార్హం.


# అశ్వాపురం మండలంలో సంక్షేమ పథకాల సందడి

**38 మంది కి కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ**

**నూతన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమాలు**


**పాల్గొన్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు**

**భద్రాద్రి జిల్లా బ్యూరో, జూన్ 06 (వార్త సంధ్య) :** తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ఫలాలు అర్హులైన ప్రజలకు చేరేలా కృషి చేస్తున్నామని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం అశ్వాపురం మండలంలోని రైతు వేదికలో నిర్వహించిన కార్యక్రమంలో కల్యాణ లక్ష్మి -- షాదీ ముబారక్ పథకం కింద మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు అందజేసిన ఆయన, అనంతరం ఆనందపురం గ్రామంలో నూతన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు. అశ్వాపురం మండలానికి చెందిన 38 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.38,42,408 విలువైన కల్యాణ లక్ష్మి -- షాదీ ముబారక్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేద, మధ్యతరగతి కుటుంబాల ఆడపిల్లల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించడంలో ఈ పథకం కీలక పాత్ర పోషిస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు ప్రతి అర్హ కుటుంబానికి చేరేలా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు.



అనంతరం మండలంలోని ఆనందపురం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద నిర్మించుకున్న నూతన గృహాల గృహప్రవేశ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. లబ్ధిదారులు చింతలపూడి సుకన్య, గన్నారపు రాజేశ్వరి, సోడే సుభద్ర, పోడియం కుమారి, నాగుల నాగలక్ష్మి, మన్నెం సత్యవాణి నూతన గృహాల్లో నిర్వహించిన గృహప్రవేశ కార్యక్రమాలకు హాజరై కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పేద ప్రజలకు సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా వేలాది కుటుంబాలు లబ్ధి పొందుతున్నాయని, అర్హులైన ప్రతి కుటుంబానికి



ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈ కార్యక్రమాల్లో ఎంఆర్ఓ సూర్యప్రకాష్, ఎంపీడీఓ ముత్యాలరావు, హౌసింగ్ ఏఈ ఉదయ్ కుమార్, ఆర్ఐ లీలావతి, సెక్రటరీ వేణుప్రియ, జీపీవో చిరంజీవి, గాదె కేశవరెడ్డి, ఓరుగంటి రమేష్ బాబు, ఊసా అనిల్ కుమార్, తుక్కాని మధుసూదన్ రెడ్డి, వేములపల్లి రమేష్, సర్పంచులు సబ్కా పిచ్చయ్య, కోర్సా కృష్ణ, మచ్చా నరసింహారావు, లంకమల్ల కొండలరావు, తెల్లం వీరభద్రం, ఎం.డి. షార్ఫుద్దీన్, వేముల విజయ్, నూకల సంపత్, పర్సబోయిన సోమలింగం, రావుల వీరభద్రం, బట్టి వెంకన్న, బాలిన నరేష్, రావులపల్లి నరసింహారావు, కుర్రం పిచ్చయ్య, వంగూరి మధు, మురికిపూడి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# బాలాజీ నగర్‌లో బండి రమేష్ పాదయాత్ర: ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

**వార్తా సంధ్య కూకట్‌పల్లి :** కూకట్‌పల్లి నియోజకవర్గంలోని బాలాజీ నగర్ డివిజన్ పరిధిలో స్థానిక సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, కమ్మ కార్పొరేషన్ చైర్మన్, టీపీసీసీ ఉపాధ్యక్షులు బండి రమేష్ శనివారం విస్తృత పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు, మహిళలు ఆయనకు శాలువాలు, పుష్పగుచ్ఛాలతో ఘన స్వాగతం పలికారు. పాదయాత్రలో భాగంగా ప్రతి వీధిని సందర్శించిన బండి రమేష్‌కు స్థానికులు తమ డ్రైనేజీ సమస్యలు, రోడ్ల దుస్థితిని వివరించి, వినతిపత్రాలు అందజేశారు. ముఖ్యంగా అపోలో ఫార్మసీ ఎదురుగా ఉన్న రోడ్డును 60 అడుగులకు విస్తరించి, డివైడర్ ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనపై ప్రజలు వ్యక్తంచేసిన ఆందోళనలను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా



బండి రమేష్ మాట్లాడుతూ గత ప్రభుత్వం పదేళ్లలో భారీగా అభివృద్ధి చేశామని చెప్పుకున్నా, క్షేత్రస్థాయిలో ఇంకా ఇన్ని సమస్యలు ఉండటం విచారకరం. అపోలో ఫార్మసీ ఎదురుగా ఉన్న రోడ్డును ప్రభుత్వం ఇప్పటికే రూ.1 కోటి నిధులతో 40 అడుగుల రహదారిగా మంజూరు చేసింది. రోడ్డు విస్తరణపై ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని, అధికారులతో చర్చించి అందరికీ అనుకూలమైన నిర్ణయం తీసుకుంటాం. చిన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించిన ఆయన, పెద్ద సమస్యలను అవసరమైతే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. తాను మళ్లీ పాదయాత్రకు వచ్చేసరికి బాలాజీ నగర్‌లో ఎలాంటి సమస్యలు మిగలకూడదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

